సంక్షిప్త వార్తలు

ఫార్మా కళాశాలలో ట్రెడిషనల్ డే


ఆటపాటలతో అలరిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణం లోని విష్ణు ఫార్మా కళాశాలలో శుక్రవారం ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలకు వచ్చారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టే బోనాల పండుగ ఊరేగింపు, బతుకమ్మ ఆటపాటలు, భోగి మంటలు, ముగ్గులు వేసి అందరిని అలరించారు. ఆయా సాంస్కృతిక సాంప్రదాయ నృత్యాలు, ముగ్గులు వేయడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఏఎస్ఐ జయపాల్ రెడ్డి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ సాయిబాబా, విజయ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

రేగోడ్(మెదక్): క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. రేగోడ్‌లో మాజీ సర్పంచ్ నర్సింహులు స్మారకార్థం ఆయన కుమారుడు చక్రపాణి ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులకు క్రీడలు ఎంతో అవసరమని, ఇలాంటి టోర్నమెంట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చక్రపాణి మాట్లాడుతూ సుమారు అరవై జట్లు నమోదు చేసుకున్నాయని, పదిహేను రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, ఏఎంసీ డైరెక్టర్ భద్రారెడ్డి, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయం వెలకట్టలేనిది


విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సహాయం వెలకట్టలేనిదని ప్రధానోపాధ్యాయుడు యాదగిరి అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బుర్ర మురళిగౌడ్ టై, బెల్టులు, స్టేషనరీ సామగ్రి శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాఘవరెడ్డి, శంకర్, నాగేష్, కిష్టయ్య, వెంకటయ్య, అంజయ్య, లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

మట్టి తరలింపుతో రైతులకు లాభం


పొలాలకు వేసిన మట్టి రోడ్డును చూపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): చెరువు నుంచి మట్టి తరలింపు వల్ల రైతులకు లాభం చేకూరిందని మండల పరిధి ఎదుల్లాపూర్ రైతులు కల్లూరి పాండురంగం, దుర్గారెడ్డి, యాదిరెడ్డి, సునందారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సాయిలు శుక్రవారం అన్నారు. గ్రామ చెరువులో నుంచి షేగల్ స్వచ్ఛంద సంస్థ మట్టిని ఉచితంగా తరలించి ప్రమాదభరితంగా ఉన్న పాడుబడిన బావులు పూడ్చడంతో పాటు వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్డు వేస్తుండడం రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. గ్రామ చెరువులో నుంచి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించడం లేదన్నారు. సంస్థ నుంచి పలువురు రైతులకు ఉచితంగా విత్తనాలు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు దోహద పడిందన్నారు. కొందరు వ్యక్తులు వారి స్వార్థం కోసం స్వచ్ఛంద సంస్థ చేస్తున్న పనులకు ఆటంకం కల్పించేలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు.

ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు


మాట్లాడుతున్న కిషన్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జూనియర్ కళాశాలల ఉమ్మడి మెదక్ జిల్లా పర్యవేక్షణాధికారి కిషన్ అన్నారు. డీఐఈఓ రవీందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం డీఐఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధంచేసి, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు చోరీ

గజ్వేల్‌రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్ చోరీచేసిన ఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గురువారం రాత్రి కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. దాని విలువ రూ.20వేలు ఉంటుందని విద్యుత్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లాలోని పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.


నిజాంపేటలో....


కాళ్లకల్ పాఠశాలలో..


వెంకటాపూర్(ఆర్)లో పతంగులతో విద్యార్థులు


సోమక్కపేట్‌లో రంగవల్లులను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు


కొల్చారంలో...


శివ్వంపేటలో...


శ్రీవిద్య పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

పాడైపోతున్నాయి!

సరైన పత్రాలు లేక ఆర్‌టీఏ అధికారులు సీజ్ చేసిన వాహనాలు, అక్రమ రవాణా కేసులతో పాటు రోడ్డు ప్రమాదాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు, ఆర్‌టీఏ అధికారుల వద్దే ఉండిపోతున్నాయి. తాజాగా నర్సాపూర్ ఆర్‌టీసీ డిపోలో భద్రపర్చిన పలు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి.

- పట్టుబడిన వాహనాలపై పట్టింపు కరువు
- ముందుకు రాని యజమానులు
- వేలం వేసి విక్రయించని అధికారులు


నర్సాపూర్ పోలీసుల ఆధీనంలో ఉన్న బైక్‌లు

నర్సాపూర్: అనుమతి లేకుండా సరుకులు అక్రమ రవాణా చేస్తున్న సందర్భంలో పోలీసులకు చిక్కినప్పుడు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, వాహనాల తనిఖీలో సరైన పత్రాలు లేక దొరికినప్పుడు.. ఇంకా పలు రకాల కేసులలో వ్యక్తులు వినియోగించిన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటారు. కాగా ఆర్‌టీఏ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టి వాహనాలకు ఇన్సురెన్స్‌తో పాటు సరైన డాక్యుమెంట్లు లేనప్పుడు ఆయా వాహనాలను సీజ్ చేసి దగ్గరలోని పోలీస్‌లకు అప్పగించడం లేదా ఆయా ప్రభుత్వశాఖలకు చెందిన కార్యాలయాల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో పెడుతుంటారు. అయితే ఆ వాహనాలకు రక్షణ లేకుండా పోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా పట్టుబడిన వాహనాల యజమానులు రానందున అవి తుప్పు పట్టి పాడైతే ఎవరికీ ప్రయోజనం లేనందున నిర్ణీత గడువు వరకు రానిపక్షంలో వాటిని వేలం వేసి విక్రయిస్తే ప్రభుత్వానికి ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

> **నోటీసులు ఇచ్చాం**
>
> 
>
> ఇటీవల జిల్లా పోలీస్ కార్యాలయంలో వాహనాలు వేలం వేసినప్పుడు నర్సాపూర్ సర్కిల్‌కు చెందిన 55 వాహనాలను సైతం వేలం వేశాం. తమ ఆధీనంలో ఉన్న మిగిలిన వాహనదారులకు ఇటీవల నోటీసులు ఇచ్చాం. మరోసారి నోటీసులు ఇచ్చినా వాహనాలు తీసుకువెళ్లేందుకు వారు రానిపక్షంలో తమ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా వాటిని వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటాం. కాగా ఎవరైనా వస్తే నిబంధనల మేరకు వాహనాలు రిలీజ్ చేస్తున్నాం. తమ వద్ద ఉన్న వాహనాలకు సంబంధించి రక్షణ చర్యలు తీసుకుంటున్నాం.
>
> – జాన్‌రెడ్డి, పట్టణ సీఐ

టేబుల్ ఎజెండా ఎందుకు పెట్టలేదు

- కమిషనర్‌పై సభ్యులు ఆగ్రహం
- ప్రజా సమస్యలు మీకేం తెలుసని నిలదీత


మాట్లాడుతున్న చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: కౌన్సిల్ సమావేశంలో టేబుల్ ఎజెండా ఎందుకు పెట్టలేదని మున్సిపల్ కమిషనర్‌పై పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో ఎజెండా లేకపోవడంతో ప్రజా సమస్యలపై ఎలా చర్చిస్తారని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు, వారి అవసరాలకు అనుగుణంగా కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. అనంతరం చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ టేబుల్ ఎజెండాను 1981 నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర అంశాలుంటే కౌన్సిలర్లతో చర్చించి తీర్మానం ప్రవేశ పెడుతామని, కొత్త నిబంధనలు తీసుకురావడం కుదరదన్నారు. అనంతరం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంగణంలో దేవాలయం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కౌన్సిలర్లు మేఘమాల, కృష్ణారెడ్డి కోరారు. చైర్మన్ మాట్లాడుతూ స్థలం కేటాయించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే ఉందన్నారు. ఆయా మతాల వారు ఆలయాలు నిర్మించుకునేందుకు గతంలో స్థలాలు కేటాయించామని, ఇటీవల మజీద్ కట్టుకుంటే ఎవరు అభ్యంతరం చెప్పలేదన్నారు. నూతన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదని 1,3 వార్డుల కౌన్సిలర్లు కిశోర్, విశ్వం చెప్పగా.. ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నమోదు చేస్తేనే అనుమతులు ఉంటాయని స్పందించిన టీపీఓ భూపతి తెలిపారు. పాలకవర్గం కాలవ్యవధి త్వరలో ముగుస్తుందని, పెండింగ్‌లో ఉన్న పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు రుక్మిణి, లలిత, జయరాజ్, దొంతి లక్ష్మిముత్యంగౌడ్, రాగి వనజ, మమత, ఆవారి శేఖర్, లక్ష్మినారాయణ, ఆంజనేయులు, ఆర్కె.శ్రీనివాస్, రాజలింగం, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ మహేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం భూముల సర్వే


రోడ్డు మ్యాప్ చూపుతున్న సర్వేయర్ రవిప్రసాద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి, బండపోతుగల్ గ్రామాల శివారు నుంచి మంజీరా వాగు వరకు నిర్మించే రోడ్డు కోసం భూముల సర్వే చేపట్టామని సర్వేయర్ రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరుశరాంరెడ్డితో కలిసి ఆయన రోడ్డు ఇరు వైపులా ఉన్న రైతుల భూములను సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగిపేట నుంచి మంజీరా వాగు మీదుగా అజ్జమర్రికి రోడ్డు పనులు మంజూరు అయ్యాయన్నారు. ఒకటిన్నర కిలోమీటరు వరకు రోడ్డు వేయాల్సి ఉందన్నారు. పట్టాదారులైన రైతుల భూములు సర్వే చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే భూసర్వే పూర్తి చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకుడు రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకొనేదెన్నడో?

- నీళ్లు, బోర్డులు లేవని ఆలస్యం
- కూకుట్లపల్లిలో నూతన పాఠశాల భవనం పరిస్థితి


ప్రారంభానికి నోచుకోని కూకుట్లపల్లి పాఠశాల

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నోఏళ్లకు నూతన పాఠశాల భవనం కొత్త రంగులతో ప్రారంభానికి ముస్తాబు అయింది. అయితే పాఠశాలకు నీళ్లు, బోర్డులులేక ప్రారంభానికి నోచుకోవడంలేదు. కూకుట్లపల్లిలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామ సమీపంలోనే ఆరు గదులతో నూతన భవనం నిర్మించారు. ప్రహరీ లేదని ప్రారంభించలేదు. ఇటీవల ఉపాధిహామీ నిధులతో ప్రహరీని సైతం నిర్మించి పాఠశాలకు రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. అయితే మరో సమస్య తలెత్తింది. పాఠశాల అవసరాలకు నీళ్లలేక పోవడం, తరగతి గదులలో బోర్డులు ఏర్పాటు కాకపోవడంతో ప్రారంభించడంలేదని హెచ్‌ఎం రాంచందర్ తెలిపారు. వీటికి నిధులు లేకపోవడంతో ప్రారంభానికి ఆలస్యం అవుతుందని గ్రామ నాయకుడు కాంతారావు చెపుతున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుల బిల్లులు చెల్లించాలి


ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

చిన్నశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే అందించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాయలం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ శ్రీలతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశం, నర్సమ్మ సిద్దిరాములు, లాలుప్రసాద్, యాదగిరి, రాములు, రవి పాల్గొన్నారు.

‘ముక్కోటి’ వైభవం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. ఉత్తర ద్వారం ద్వారా దేవాతామూర్తుల దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


చేగుంట(తూప్రాన్): బారులు తీరిన భక్తులు


చేగుంట(తూప్రాన్)లో..


తూప్రాన్: గీతా మందిరంలో..


అల్లాదుర్గంలో..


రామాయంపేట: పూజల్లో పాల్గొన్న భక్తులు


పాపన్నపేటలో..


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో...

క్లుప్తంగా

చైనా మాంజా అమ్మితే చర్యలు

నర్సాపూర్: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలు ఎగురవేసేందుకు చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లింగం హెచ్చరించారు. చైనా మాంజా అమ్మినా, వినియోగించినా చర్యలు తప్పవని చెప్పారు. మాంజాతో ప్రమాదాలు జరగడంతో పాటు ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. కాటన్ దారం వినియోగించాలని, అందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఎస్ఐ కోరారు.

రేగోడ్(మెదక్): సంక్రాంతి పండుగ సందర్భంగా నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రేగోడ్ ఎస్ఐ.పోచయ్య అన్నారు. చైనా మాంజా వల్ల వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హరిద్ర అలంకరణలో అమ్మవారికి పూజలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మహంకాళీ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని హరిద్ర (పసుపు)తో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి రఘువశర్మ నిజరూప దర్శనం కల్పించారు.

నేడు ముగ్గుల పోటీలు

నర్సాపూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రసాద్, /జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్ తెలిపారు. పట్టణంలోని 10, 11 వార్డులకు చెందిన మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన వచ్చని చెప్పారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): పశువులు, గొర్రెలు, మేకలు, పెరటి కోళ్ల పెంపకం కోసం ఏర్పాటు చేసుకునే షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఏపీఎం శ్యామ్ అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో పశువుల షెడ్ల నిర్మాణాలకు రూ.40వేల నుంచి రూ.80వేల వరకు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు మార్చి వరకు తమ దరఖాస్తులను ఈజీఎస్ సిబ్బందికి, గ్రామ కార్యదర్శులకు అందించాలని కోరారు.

హిందీ సీఆర్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట కేజీబీవీలో ఖాళీగా ఉన్న హిందీ సీఆర్టీ పోస్టులో తాత్కాలికంగా పని చేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ బాల లక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. బీఈడీ, హెచ్‌పీటీ, హిందీ సబ్జెక్టులో ఉత్తీర్ణులై, అర్హత గల అభ్యర్థులు శనివారం సాయంత్రం వరకు పాపన్నపేట కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దొంగను పట్టుకున్న స్థానికులు

నర్సాపూర్: మొబైల్ ఫోన్ల చోరీకి పాల్పడుతున్న దొంగను ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం నర్సాపూర్‌లో కొనసాగుతున్న సంతలో ఓ యువకుడు మొబైల్ ఫోన్లను చోరీ చేస్తుండగా కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తులు అతన్ని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

చిన్నారులకు చేయూత

గజ్వేల్‌రూరల్: తల్లి మృతిచెందడంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు చిన్నారులకు ఎస్ఆర్ ఫౌండేషన్ చేయూతనందించింది. మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన మాస్టి నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆమె ముగ్గురు కొడుకులు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ అధ్యక్షురాలు మహ్మద్ సుల్తానాఉమర్ శుక్రవారం వారిని పరామర్శించి నిత్యావసర సరుకులు, దుస్తులు, ఆర్థిక సాయం అందించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన నర్సారెడ్డి

గజ్వేల్: మేరు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.